క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

శృంగవరపుకోట: మండలంలో వసి గ్రామంలో మంచినీటి కోనేరు గట్టుపై ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు కృష్ణమూర్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. వసి, తిమిడి, గ్రామ సర్పంచ్‌లు ఒబ్బిన పార్వతి, త్రినాధమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పట్నాయక్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టరు, ప్రజల వినతులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న వినతులపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, ప్రజల కు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

సీఎం జగన్ పర్యటన విజయవంతం చేయండి

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 3న జిల్లాకు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 3న ఉదయం 10 గంటలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. దీంతోపాటు పలు తాగు, సాగునీటి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. సీఎం పర్యటనకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. వారితో పాటు పార్టీ నాయకులు పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, రేవల్ల సత్తిబాబు, గంగుబిల్లి తాడు తదితరులు ఉన్నారు.

వస్త్రాల తయారీ కిట్లు పంపిణీ

శృంగవరపుకోట: భారత డైనమిక్స్ లిమిటెడ్ సౌజన్యంతో గ్రామీణ స్త్రీలు నిర్వహిస్తున్న వస్త్ర తయారీలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ రఘురాజు సోమవారం సందర్శించారు. అనంతరం సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ప్రోగ్రాం కింద బీడీఎల్ సమకూర్చిన వస్త్రతయారీ రంగంలో వినియోగించే కిట్లను 30 మందికి స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎంపీడీఓ శేషుబాబు పాల్గొన్నారు.

జిల్లా శిష్టకరణ సంఘం కోశాధికారిగా వాండ్రంగి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణానికి చెందిన వాండ్రంగి వెంకటేష్ జిల్లా శిష్టకరణ సంఘం కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల గరివిడి సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కమిటీల ఏర్పాటు

దత్తిరాజేరు: స్పందన కార్యక్రమంలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రమేష్ సోమవారం తెలిపారు. ఈ కమిటీలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్సై, ఏఎస్సై, డీటీ సభ్యులుగా ఉంటారన్నారు. స్పందనలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందచేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా పాలస్నాన మహోత్సవం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామంలో శ్యామలాంబ అమ్మవారి పాలస్నాన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్నాడ సూర్యనారాయణ, సర్పంచు పొన్నాడ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.5 వేలు విరాళం

చీపురుపల్లి: పట్టణంలోని లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గరివిడికి చెందిన పి.రవికిరణ్ రూ.5 వేలు ఆర్థిక సహకారం అందించారు. ఈ మొత్తాన్ని క్లబ్ ప్రతినిధి ఎస్.రాధాకృష్ణకు సోమవారం అందజేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు చెప్పారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలో బొద్దాం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఐదో వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు. సాయంత్రం గ్రామపురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

ఠంచన్‌గా పింఛన్


దత్తిరాజేరు: టి.భూర్జవలసలో లబ్ధిదారుని బయోమెట్రిక్ నమోదు చేస్తున్న వలంటీర్


వేపాడ: విశాఖలో చికిత్స తీసుకుంటున్న జాకేరుకు చెందిన గొర్లె ఈశ్వరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివ


గుర్ల: సాలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జమ్ము గ్రామానికి చెందిన జి.వెంకునాయుడుకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న వలంటీర్ ఆదినారాయణ


గజపతినగరం రూరల్: భూదేవిపేటలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది


గజపతినగరం: పురిటిపెంట న్యూకాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ శ్రీదేవి


జామి: విశాఖలోని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న శిరికిపాలెంకు చెందిన నాగేశ్వరరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ లక్ష్మి

వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగింది. సోమవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి పింఛన్ డబ్బులు అందజేశారు. ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు అందివ్వడంతో అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


వృద్ధుడి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

● 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామలింగాపురం గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' 187వ రోజు కార్యక్రమాన్ని రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబుతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలను నమోదు చేసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇప్పటివరకు తమ దృష్టికి వచ్చిన సమస్యలను 70 శాతానికి పైగా పరిష్కరించామన్నారు. పేదలు, రైతులు, మహిళలు, ఇలా అన్ని వర్గాలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ద్వారా రూ.230 కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పద్మజ, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, రామలింగాపురం సర్పంచ్‌ల నెక్కలి గౌరినాయుడు, ఎంపీటీసీ లెంక వరహాలు, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, పార్టీ నాయకులు మేలాస్త్రీ అప్పారావు, పీఎస్ఎన్ పాత్రుడు, గణేష్, పైడింనాయుడు, దేమున్నాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికల్లో సెలక్ట్ అయిన 15 మంది విద్యార్థులకు సోమవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. దీనిపై పరిశ్రమల యాజమాన్యాలతో ప్రభుత్వాధికారులు మాట్లాడుతున్నట్లు చెప్పారు. రూ.8 కోట్లతో చీపురుపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరడ రాందాసు, మంగళగిరి శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయలక్ష్మి, విభాగాధిపతులు చంద్రమౌళి, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొత్తవలస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ సోమవారం తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. అలాగే గత సమావేశం దృష్టికి వచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పూర్తి నివేదికలతో అధికారులు హాజరుకావాలని సూచించారు.

4న గంట్యాడలో..

గంట్యాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వీఆర్‌వీ బానోజీరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండల పరిషత్ సభ్యులతో పాటు అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండలంలోని నెలివాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈఈ ఆర్.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, లైన్ల మార్పు కారణంగా సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని నెలివాడ, గరుడుబిల్లి, అంబటివలస, గొట్లాం, రోళ్లవాక తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

మహిళల జీవనోపాధికి కుట్టుశిక్షణ


శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక

గజపతినగరం: మహిళలు సొంతంగా జీవనోపాధి పొందేందుకు స్కిల్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద ప్రభుత్వం టైలరింగ్‌లో శిక్షణ అందిస్తోందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బెల్లాన బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కుట్టుశిక్షణ తీసుకున్న మహిళలతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మహిళల జీవనోపాధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. టైలరింగ్‌ను జీవనోపాధిగా ఎంచుకున్న వారికి జగనన్న చేదోడు పథకం కింద ఏటా రూ.10 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు, టైలరింగ్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ జె.లక్ష్మునాయుడు, పురిటిపెంట, తుమికాపల్లి సర్పంచ్‌లు కొంత్యాన విజయలక్ష్మి, బెల్లాన త్రినాథరావు, జిల్లా రీసోర్స్ పర్సన్ కృష్ణవేణి, ఏపీఎంలు ఇందిరాదేవి, సత్యవతి, యు.జగదీష్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బహుళ పంటల సాగుతో లాభాలు


నవధాన్యాల కిట్లు అందచేస్తున్న రైతుసాధికార సంస్థ అధికారి హేమసుందర్

బొండపల్లి: అంతరపంటల సాగుతో అదనపు ఆదాయం లభిస్తుందని రైతుసాధికారిత సంస్థ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమసుందర్ అన్నారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాలయ సాగుపై అవగాహన కల్పించారు. అంతర పంటలు, నవధాన్యాల సాగు, ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. అనంతరం నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్‌డివిజన్ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ, మోపాడ రామ్మూర్తి, తదితేరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)కు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఆస్పత్రుల్లో నియామకాలు జరిపినట్లు చెప్పారు. ఎక్కడా వైద్యులు, సిబ్బంది కొరత లేదన్నారు. ఆస్పత్రిలో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యసేవల విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఆస్పత్రి అభివృద్ధి సంఘం ప్రతినిధులు కింతలి మధు, ఎంపీటీసీ గిరడ రాందాసు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.నాయక్, వైద్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం


చీపురుపల్లి: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయరామేశ్వరి

చీపురుపల్లి: కార్మికుల హక్కుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు హాలులో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక చట్టాలుపై కార్మికులకు అవగాహన కల్పించారు. చట్ట ప్రకారం స్త్రీ, పురుష కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని స్పష్టం చేశారు. కార్మిక హక్కులకు భంగం వాటిల్లితే కోర్టులను ఆశ్రయించవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఆర్.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

– గజపతినగరం: కార్మికుల దినోత్సవం సందర్భంగా పురిటిపెంట ఎస్సీ కాలనీలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆదినారాయణ కార్మిక చట్టాలపై అవగాహణ కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

స్పందన వినతుల పరిష్కారంపై దృష్టి

బొండపల్లి: సచివాలయ స్పందనలో అందిన వినతులపై సిబ్బంది సకాలంలో స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు, ఎంపీడీఓ ఎ.వేదవతి, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని పలువురు వినతులు అందజేశారు. కనిమెరక గ్రామంలోని ఎం.ఎస్ ఛానల్ ఆక్రమణపై గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు.

గజపతినగరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు నాలుగు వినతులు వచ్చాయని ఎంపీడీఓ పప్పు సుదర్శనం తెలిపారు. కొత్త శ్రీరంగరాజుపురంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని సర్పంచ్ యిజ్జిరోతు పైడిపునాయుడు, పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతూ పురిటిపెంటకు చెందిన శ్రీనివాస్, శ్మశానవాటిక ఆక్రమణపై గుడివాడ సర్పంచ్ యేండ్రాపు రామునాయుడు అధికారులకు వినతులు అందజేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బొండపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సోమవారం క్రాష్‌ప్రోగ్రాం వాహనాన్ని ఆయన ప్రారంభించారు. మండల పరిధిలో పాడైన తాగునీటి బోర్లు మరమ్మతుల కోసం క్రాష్‌ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడైనా బోర్లు పాడైతే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వేదవతి, ఆర్‌డబ్ల్యూఎస్ జెఈఈ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

గుర్ల: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని జమ్ము గ్రామంలో సోమవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి నుంచి పూర్తిగా బయటపడవచ్చన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారి స్వప్న, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది గౌరీశంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించరూ..

వేపాడ: మండలంలో నీలకంఠరాజపురం ఎస్సీ కాలనీ సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, తామంతా చీకట్లో ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ ఏఈ సూరిబాబు వద్ద ప్రస్తావించగా..మంగళవారం ఉదయం కొత్త స్తంభం ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

శ్రామికులకు సలాం..


శృంగవరపుకోట: వెంకటరమణపేటలో మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మికులు, కార్మిక సంఘం నేతలు


లక్కవరపుకోట: హాస్టల్ జంక్షన్ వద్ద ఎర్రజెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు


చీపురుపల్లి రూరల్: మేడే వేడుకల్లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు గౌరినాయుడు



గజపతినగరం: ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు, కార్మికులు


గజపతినగరం: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలు


శృంగవరపుకోట: ఎస్.కోటలో ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరావు

మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కులు సాధించుకోవాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శ్రమజీవులకు సలాం చేస్తూ.. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి..అంటూ నినాదాలు చేశారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొని, కార్మిక హక్కులు, సంక్షేమంపై గళమెత్తారు. శ్రమజీవుల సంక్షేమానికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని కోరారు. అనంతరం ఎర్రజెండా ఆవిష్కరించి, కార్మికుల శ్రేయస్సు కోసం చేసిన పోరాటంలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్